క్లుప్తంగా

'పీఆర్' ప్రిన్సిపాల్‌గా తిరుపాణ్యం బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ తిరుపాణ్యం

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ తిరుపాణ్యం శనివారం బాధ్యతలు స్వీకరించారు. గత నెల మూడున నిర్వహించిన 14, 15 గ్రాడ్యుయేషన్ డే వేడుకల నిర్వహణకు రాష్ట్ర కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. నగరానికి వచ్చినప్పటి నుంచి ఆయనకు ప్రత్యేక సదుపాయాలు ఏమీ కల్పించకపోగా, విద్యార్థుల క్రమశిక్షణ ఏర్పాట్లు తదితర అంశాలను కారణాలుగా చూపుతూ తిరుపాణ్యంను అకస్మాత్తుగా చోడవరం బదిలీ చేశారు. అక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రామచంద్రరావును పీఆర్ డిగ్రీ కళాశాలకు బదిలీ చేయగా తిరుపాణ్యం హైకోర్టును ఆశ్రయించి తనను ఏ కారణంగా బదిలీ చేశారో తెలపాలని కోరారు. కోర్టు బదిలీ ఉత్తర్వులు నిలిపివేసి తిరిగి యాథాస్థానంలో ఉంచాలని ప్రభుత్వానికి నివేదించింది. ఈ మేరకు తిరుపాణ్యంను ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించగా టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది అభినందించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: కోరమాండల్ మహిళ క్లబ్ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి, ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ పట్నాయక్, లక్ష్మీ సృజన, అంజుమ్, రేలంగి బాపిరాజు, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

థామస్ అల్వా ఎడిసన్‌కు నివాళి

కాకినాడ రూరల్: విద్యుత్ బుల్బు వంటి ఉపకరణాలను కనుగొన్న శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిసన్ జయంతిని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం శనివారం నిర్వహించి, ఆయనకు నివాళులు అర్పించింది. విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగపతిబాబు అభిమానుల వితరణ

కాకినాడ: నటుడు జగపతిబాబు జన్మదిన వేడుకను అభిమానులు స్థానిక ఆనందనిలయంలో నిర్వహించారు. చిన్నారుల మధ్య కేక్ కట్‌చేసి బక్కెట్లు, బిస్కెట్లు, సబ్బులు, ఇతర వస్తువులు అందజేశారు. అనంతరం పిల్లలకు భోజనం పెట్టారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు), వైఎస్సార్ సీపీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి డీకే రెడ్డి, శివాలయం మాజీ చైర్మన్ బాదం మధు, మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత, జగపతిబాబు ఫ్యాన్స్ వైదాడి శివ, గుప్త, గబ్బర్, రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

జనసేన బూత్ కమిటీ సమావేశం

బాలాజీచెరువు: జనసేన పార్టీ 23వ డివిజన్ బూత్‌కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకరణ శనివారం నిర్వహించారు. నగర ఇన్‌చార్జి మూత్తా శశిధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి శివ,తలాటం సత్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పిఠాపురం: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పిఠాపురం పట్టణ పోలీసులు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 4న పిఠాపురం రథాలపేట సెంటర్లో ఒక వ్యక్తి నడుస్తూ కుప్పకూలిపోగా స్థానికులు చూసి 108కి సమాచారం ఇవ్వడంతో అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అయితే అతని వివరాలు తెలియరాలేదని, ఎవరికైనా వివరాలు తెలిస్తే పిఠాపురం సీఐ 94407 96523, ఎస్సై 94407 96560 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

స్నానాల రేవుల పరిశీలన

ఏలేశ్వరం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఏలేరు కాలువలో వేలాది మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ మేరకు స్థానిక శివాలయం వద్ద ఉన్న బ్రాహ్మణ రేవు, ఇతర స్నానాల ఘాట్‌లను ఆధునీకరిస్తున్నారు. కాగా శనివారం కౌన్సిలర్లు అలమండ చలమయ్య, శిగడం వెంకటేశ్వరరావు, మసిరపు నాగేశ్వరరావు తదితరులు స్నానాల రేవులను పరిశీలించారు. శివరాత్రి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్నానాల రేవులను ఆధునీకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు ప్రాణ సంకటం

- పట్టి పీడిస్తున్న లంపీ స్కిన్ వ్యాధి
- అప్రమత్తమైన నగరపాలక సంస్థ
- వ్యాధి సోకిన పశువులకు ఇంజెక్షన్లు


ఆవుకు వ్యాక్సిన్ వేస్తున్న నగరపాలక సిబ్బంది. (అంతరచిత్రం) ఒళ్లంతా కణితులతో లంపీ స్కిన్ సోకిన పశువు

కాకినాడ సిటీ: లంపీస్కిన్ (ముద్ద చర్మవ్యాధి) నగరాల్లోని పశువులను కలవరపెడుతోంది. కొండ ప్రాంతాల్లోనే కనపడే ఈ వైరస్ నేడు నగరాలకూ విస్తరించింది. బాహ్య పరాన్న జీవుల ద్వారా వ్యాప్తి చెందే ఈ వ్యాధి ఈగలు, దోమల ద్వారా పశువులకు వ్యాపిస్తున్నట్టు గుర్తించారు. తెల్ల, నల్ల జాతి పశువుల్లో ప్రబలే ఈ వ్యాధి ఎక్కువగా ఆవుల్లో కనిపించడం ఆందోళన కలిగించే అంశం. ఈ వ్యాధి సోకిన పశువులు 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతూ ఉంటాయి. చర్మంపై కణితుల మాదిరిగా దద్దుర్లు, పొక్కులు వస్తాయి. కాళ్ల వాపులు వస్తాయి. పాల దిగుబడి తగ్గి చూడి ఆవులు ఈడ్చుకుపోయే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

దోమలు, పేలు, ఈగల ద్వారా ఇతర జంతువులకు ఈ వ్యాధి వ్యాపిస్తోంది. రక్తం పీల్చే కీటకాలు, కొన్ని రకాల ఈగలు, కలుషిత ఆహారం, నీటి ద్వారా కూడా ఈ వైరస్ వ్యాపిస్తోంది. వ్యాధి సోకిన పశువుల గాయాల్లో లాలాజలం, ముక్కు నుంచి వచ్చే స్రావాలు, వీర్యంలోను వైరస్ ఉంటుంది. ఈ వైరస్ ప్రభావం 4 నుంచి 14 రోజుల వరకు ఉంటుంది.

నివారణకు చర్యలు

నగరంలో ఆరు బయట తిరుగుతున్న ఆవుల్లో లంపీస్కిన్ వ్యాధిని గుర్తించిన నగరపాలక సంస్థ అధికారులు వాటికి వ్యాక్సిన్లు వేస్తున్నారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో సుమారు 300 ఆవులకు ఈ వ్యాధి సోకినట్లు గుర్తించి ఇంజెక్షన్లు చేశారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహరావు ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ చర్యలు చేపడుతున్న సిబ్బంది వైరస్ సోకినపుడు ఏం చేయాలో పశు పోషకులకు వివరిస్తున్నారు.

ప్రత్యేక చర్యలు..



ఇటీవల కాలంలో లంపీ స్కిన్ బారిన పడి పశువులు అల్లాడుతున్నాయి. కొన్ని మరణిస్తున్నాయి. ఈ వ్యాధి బారిన పడ్డ పశువులకు మూడు డోసుల వ్యాక్సినేషన్ అవసరం. ఇందుకు రూ.1000 నుంచి రూ.1200లు వరకు ఖర్చు అవుతుంది. గోవులను రక్షించేందుకు నగరంలో ముమ్మర చర్యలు చేపట్టాం. గోవులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరుతున్నాం. – సీహెచ్ నాగనరసింహారావు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, కాకినాడ

మార్వాడీ సంఘం చేయూత

లంపీ స్కిన్ వ్యాధికి గురై అల్లాడుతున్న గోవులను రక్షించేందుకు మార్వాడీ సంఘం ముందుకు వచ్చి వైద్యానికి అవసరమయ్యే మందులను నగరపాలక సంస్థకు అందజేశారు. వీరితో కొందరు ప్లానింగ్ అధికారులు ఇంజక్షన్లు ఇతర వ్యాధినిరోధక మందులను సమకూరుస్తున్నారు.

వ్యాపార వర్గాలకు అండగా ఉంటాం

- ఎంపీ గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు
- చాంబర్ భవనానికి శంకుస్థాపన


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న తదితరులు


కార్యక్రమానికి హాజరైన రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ: వ్యాపార వర్గాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. రూ.2.5 కోట్లతో ప్రతిపాదించిన ది గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ భవన పునర్నిర్మాణ పనులకు వీరు శనివారం శంకుస్థాపన చేశారు. చాంబర్ అధ్యక్షుడు పెద్ది రత్నాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వ్యాపారుల సౌకర్యార్థం ఆధునిక వసతులతో నూతన భవన నిర్మాణం చేపట్టడం శుభపరిణామమన్నారు. భవన నిర్మాణానికి తమ వంతు తోడ్పాటు అందిస్తామన్నారు. చాంబర్ అధ్యక్షుడు రత్నాజీ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో మూడంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, చాంబర్ కార్యదర్శి దాసరి సాయికృష్ణ, కోశాధికారి నూలుపూర్ణ చంద్రకుమార్, సంయుక్త కార్యదర్శి రామారావు, వ్యాపారవేత్త నారాయణం మురళి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖానా–ఖజానా పోటీలు

కాకినాడ కల్చరల్: స్థానిక శాంతినగర్‌లోని శ్రీరామకృష్ణసేవా సమితి ఆడిటోరియంలో భారత కళలు, సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఖానా–ఖజానా పేరుతో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు ఆదివారం నిర్వహించనున్నట్టు సంస్థ కన్వీనర్ వీవీఎల్ఎస్ మూర్తి తెలిపారు. స్థానికంగా పేరుపొందిన వంటకాలపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయలు, అలవాట్లపై అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 7 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. వివరాలకు 96406 01036 నంబరులో సంప్రదించాలని మూర్తి కోరారు.

ఘంటసాల ఆదర్శప్రాయుడు


ఘంటసాలకు నివాళులు అర్పిస్తున్న సంఘ సేవకులు నారాయణం మురళి తదితరులు

కాకినాడ కల్చరల్: అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరావు ఆదర్శప్రాయుడని సంఘ సేవకుడు నారాయణం మురళి అన్నారు. స్థానిక బాల త్రిపుర సుందరీ ఆలయం సెంటర్‌లోని ఘంటసాల కాంస్య విగ్రహం వద్ద సీతారామరాజు స్మారక కళావేదిక అనుబంధ సంస్థ ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం ఘంటసాల వర్ధంతి నిర్వహించారు. ఆయనకు నివాళులర్పించిన అనంతరం ఘంటసాల సంగీత సేవలను వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రావూరి వెంకటేశ్వరావు, గాయకులు బాబి తదితరులు కొనియాడారు. ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో ఘంటసాల శతజయంతి వేడుకల్లో భాగంగా సూర్యకళామందిర్‌లో గాన గంధర్వుల స్వరాభిషేకం పేరుతో 18వ తేదీ సాయంత్రం సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు వేదిక అధ్యక్షుడు కర్రి అచ్యుతరామరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరావు, నమశ్శివాయ, గాయకులు బాలు తదితరులు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్ వాకర్స్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: గాన గంధర్వుడు ఘంటసాల వర్ధంతిని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు, అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు తదితరులు నివాళులర్పించారు.

ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించాలి


ఆపద మిత్రలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న డాక్టర్ పరాశర్

సామర్లకోట: ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించడం ద్వారా ప్రజల ప్రాణాలను రక్షించే అవకాశం ఉంటుందని రెడ్ క్రాస్ సంస్థ డాక్టరు పరాశర్ ఆపద మిత్రలకు సూచించారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలోని ఆపదమిత్రలకు ఇస్తున్న శిక్షణలో శనివారం ఆయన మాట్లాడారు. ఏడో బ్యాచ్‌కు ఇస్తున్న ఆరో రోజు శిక్షణలో భాగంగా ప్రమాదంలో చిక్కుకున్న రోగిని ఎలా రక్షించాలో వివరించారు. ఆపద మిత్రలు ముందుగా వారికి అప్పగించిన ప్రాంతాలలోని ప్రజల బ్లడ్ గ్రూప్ తెలుసుకోవాలన్నారు. ఈ విధంగా తెలుసుకొవడం ద్వారా ప్రమాదాలు జరిగిన వెంటనే తమ సంస్థకు సమాచారం ఇవ్వడంతో రక్తం ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీ ఎంఎస్ఎన్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. విపత్తుల నివారణ సంస్థ జిల్లా మేనేజర్ కిరణ్మయి, ఈటీసీ మేనేజరు పి. శ్రీనివాసరావు శిక్షణను పర్యవేక్షించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 11,437 కేసుల పరిష్కారం


లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి హరినారాయణ, చిత్రంలో ఆరో అదనపు జిల్లా జడ్జి నిఖిత

కాకినాడ లీగల్: జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ ద్వారా 11,437 కేసులు పరిష్కారమయ్యాయని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం 8 బెంచ్‌లు ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, ఇన్స్రూ ప్రీ లిటిగేషన్, నేరం అంగీకరించి జరిమానా కట్టిన కేసులు, వివిధ కేసులు పరిష్కారమయ్యాయి. బెంచ్‌లకు పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, మూడో అదనపు సీనియర్ సివిల్ జడ్జి టి.మల్లేశ్వరి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్న లక్ష్మి, 3వ అదనపు, 4వ అదనపు, జూనియర్ సివిల్ జడ్జిలు కం మేజిస్ట్రేట్లు పి.భరద్వాజ్, సీకేవీ సత్యకాంత్ కుమార్, స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సి.జానకి, స్పెషల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.మాధవి న్యాయమూర్తులుగా వ్యవహరించారు. లోక్ అదాలత్ ద్వారా 11,437 కేసులు పరిష్కారం కాగా, రూ.3,70,11,591 మేర కక్షిదారులకు లబ్ధి చేకూరింది.

మహాశివరాత్రికి చురుగ్గా ఏర్పాట్లు


సామర్లకోట పంచారామ క్షేత్రం ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు


తిరునాళ్లలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్

- కల్యాణం, రథోత్సవాలకు సర్వం సిద్ధం
- లింగోద్భవ కాల దర్శనాలకు సమాయత్తం

సామర్లకోట: పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 16 నుంచి 21 వరకు శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తిరునాళ్లు జరుగుతాయి. 16న ఉదయం విఘ్నేశ్వరపూజ, మధ్యాహ్నం ఇత్తడి నందీశ్వరునిపై ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం అనంతరం రాత్రి కల్యాణం నిర్వహించనున్నారు. 17 ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, సాయంత్రం నీరాజన మంత్రపుష్పాలు చేస్తారు. 18న మహా శివరాత్రిని పురస్కరించుకొని తెల్లవారు జామున ఒంటి గంట నుంచి మూలవిరాట్ వద్ద మాత్రమే అభిషేకాలు చేస్తారు. తెల్లవారు జాము నుంచి భక్తులకు దర్శనం ఉంటుంది. ఈ మేరకు క్యూలైన్ల ఏర్పాట్లు పూర్తి చేశారు. రాత్రి 10 నుంచి 12.15 వరకు స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లింగోద్భవ కాలపూజను పిఠాపురం మహారాజా గోత్రనామాలతో మొదటి పూజ చేస్తారు. 19వ తేదీ ఉదయం అభిషేకాలు, కుంకుమార్చన, మధ్యాహ్నం 2.15 నిమిషాలకు ధూప సేవ అనంతరం రథోత్సవం ప్రారంభం అవుతుంది. 20న త్రిశూల స్నానం, అనంతరం తీర్థపు సేవ జరుగుతాయి. 21 రాత్రి శ్రీపుష్ప యాగోత్సవంతో కల్యాణంతో మహాశివరాత్రి ఉత్సవాలు ముగుస్తాయి. ఈ సందర్భంగా 16వ తేది రాత్రి సామర్లకోటలో నృత్యాంజలి కళానిలయం కళాకారులచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుంది. 17న అమృతవర్షిణి–భక్తబృందంచే గాత్ర కచేరి, 18న కన్యకాపరమేశ్వరీ భజన మండలిచే భజన, 19న అన్నమయ్య, త్యాగయ్య కీర్తనలు ఏర్పాటు చేశారు. దేవదాయశాఖ, పోలీసు, రెవెన్యూ ఆధ్వర్యంలో ఉత్సవాలలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండే విధంగా రంగం సిద్ధం చేస్తున్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవాలు


బషీర్‌బీబీ దర్గా వద్ద భక్తులు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడలో బషీర్ బీబీ (బంగారు పాపమ్మ) ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు బషీర్ బీబీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


బషీర్‌బీబీ ఆలయ ప్రాంగణంలో బస ఏర్పాటు చేసుకున్న భక్తులు

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: స్థానిక శృంగార వల్లభ ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ భక్తుల సౌకర్యాలపై ఏర్పాట్లు చేపట్టింది. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు భక్తులకు ఆశీర్వచనం అందించారు. అన్నదానం, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం 5,05,430 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్ హాజరు కాగా సుమారు 20 వేల మంది స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శృంగారవల్లభ స్వామివారు →



కనకమహాలక్ష్మి తల్లికి ప్రత్యేక పూజలు


పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న శ్రీనివాసరావు

బోట్‌క్లబ్: స్థానిక ద్వారకానగర్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా ఆలయంలో అఖండ హారతి, పూజలు చేశారు. వందలాది మంది మహిళలు పూజల్లో పాల్గొన్నారు. చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు అఖండ హారతి వెలిగించారు. అనంతరం చిన్నారి విజేతలకు బహుమతులు అందించారు. ఆలయ కమిటీ మాజీ సభ్యులు అంకంరెడ్డి రామునాయుడు, ప్రముఖ వ్యాపారవేత్త గొల్లపల్లి మహేష్, సకలా సూరిబాబు, ఆలయ ఆరాధన సంఘం సభ్యులు సరోజిని, పద్మ పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


హోమగుండాన్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: రమణయ్యపేట బోట్‌క్లబ్ ఎదురుగా బ్యాంక్ కాలనీలో శిరిడి సాయిబాబా ఆలయ 16వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొనగా ఆలయ కమిటీ, స్థానికులు ఆధ్వర్యంలో ఉదయం నుంచి విశేష పూజలు, హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. మాజీ కార్పొరేటర్ ఐ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భావనారాయణుని ఊరేగింపు


స్వామి, అమ్మవార్ల ఊరేగింపును ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ నారాయణరావు

కాకినాడ రూరల్: మాఘ మాసం సందర్భంగా సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ద్రవిడ అధ్యయనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవేరితో స్వామివారిని గ్రామ మాడ వీధులు, రాజవీధులు, తిరువీధుల్లో బాజా భజంత్రీలతో వేద మంత్రాల నడుమ ఊరేగించారు. ఈనెల 19 వరకు అధ్యయనోత్సవాలు జరుగుతాయని నండూరి లక్ష్మి పురుషోత్తమాచార్యులు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణమూర్తి ఉత్సవాలను ప్రారంభించారు. పది రోజుల పాటు స్వామికి ఉదయం, సాయంత్రం కైంకర్యంలో భాగంగా 4 వేల పాశురాలు పఠిస్తారని, 11వ రోజున ముగుస్తుందన్నారు. మూడు ఆదివారాలు పాటు వేలాదిగా భక్తులు తరలివచ్చారని, 4వ ఆదివారం వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

లోక్ అదాలత్‌లో 1182 కేసులు పరిష్కారం

పెద్దాపురం: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ స్థాయి లోక్ అదాలత్‌లో 1182 కేసులు పరిష్కరించినట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి వై.బెన్నియ్యానాయుడు తెలిపారు. సివిల్ తగాదాలు ఎనిమిదికి మొత్తం రూ.14,09,000, క్రిమినల్ కేసులు 45, మోటారు వెహికల్ కేసులు ఏడుకి మొత్తం రూ.3,08,000, బ్యాంక్ పీఎల్‌సీ 17 కేసులకు రూ.8,28,760, క్రిమినల్ చలానా కేసులు 1105కు రూ.3,66,680 రాజీ కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. మూడు బెంచ్‌ల్లో న్యాయమూర్తులు బెన్నియ్యానాయుడు, నికిత, జి.హర్షవర్ధన్ కేసులు పరిష్కరించారు.

మోటారు సైక్లిస్టును ఢీ కొన్న బస్సు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని పోలీసు అవుట్ పోస్టు వద్ద మోటారు సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొంది. దాంతో మోటారు సైకిలుపై ఉన్న వ్యక్తి ఎగిరి రోడ్డుపై పడి గాయపడ్డాడు. ఫ్లైవర్ నుంచి అవుట్ పోస్టు మీదుగా వెళ్తున్న మోటారు సైకిల్‌ను రావులపాలెం నుంచి సామర్లకోట కాంప్లెక్స్‌లోకి వస్తున్న బస్సు ఢీ కొంది. మోటారు సైకిల్ నడుపుతున్న వ్యక్తి దూరంగా పడి పోవడంతో బస్సు మోటారు సైకిల్‌ను కొంత దూరంఈడ్చుకుపోయింది. సైకిలిస్టు పాపారావును స్థానికులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

- ఆరుగురు అరెస్టు..
- రూ.33,450 స్వాధీనం

సామర్లకోట: పట్టణ శివారులో పెద్ద యేరు వద్ద పేకాట ఆడుతున్న శిబిరంపై సీఐ కె.దుర్గాప్రసాద్ తన బృందంతో శనివారం సాయంత్రం దాడి చేశారు. ఈ మేరకు ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.33,450, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.